
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 మే 2025




రైతు బజారులో నిమ్మ కాయలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

బంగినపల్లి మామిడి భళా


మామిడి పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న సీఎం

ఏమ్మా.. సొరకాయ ఎంత?


మహిళా వ్యాపారితో మాట్లాడుతున్న చంద్రబాబు

కరివేపాకు ధర పర్లేదా..!


కరివేపాకును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

ఎన్ని ఎకరాల్లో ఉల్లి సాగు..


కూరగాయల వ్యాపారితో..

ఆకుకూరలు కొంటున్నారా?


ఆకుకూరల వ్యాపారితో మాట్లాడుతూ..



గోరుకల్లు నుంచి తాగునీరు

- పాణ్యం నియోజకర్గంలో రోడ్లకు రూ.50 కోట్లు ● సీ-క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు ● ఓర్వకల్లు కేంద్రంగా పలు పరిశ్రమలు స్థాపన ● కర్నూలు నుంచి ఓర్వకల్లుకు రైల్వేలైన్, నీటి వసతి
- సీఎం చంద్రబాబు హామీ ● డాక్టర్ అంబేడ్కర్, అబ్దుల్ కలాంలు పేద కుటుంబంలో జన్మించినవారే ● నేను 8 కిలోమీటర్లు నడిచి చదువుకున్నాను ● జైరాజ్ ఇస్పాత్ కంపెనీ నిర్మించే స్వచ్ఛాంధ్ర పార్కుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు




అయ్యమ్మతో.. ఆప్యాయంగా..

పారిశుధ్య కార్మికురాలు అయ్యమ్మతో నడుస్తూ ఆమె కష్టాలను తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడు

కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి): 'కర్నూలు, కల్లూరు అర్బన్ వార్డుల్లో గోరుకల్లు జలాశయం నుంచి తాగునీటి అందిస్తాం. ఈ బృహత్తర కార్యక్రమానికి త్వరలోనే శ్రీకారం చుడుతాం. రహదారుల నిర్మాణాల కోసం రూ.50 కోట్లు కేటాయిస్తున్నా..' అని చంద్రబాబు కర్నూలు, కల్లూరు అర్బన్ వార్డులపై వరాలజల్లు కురిపించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి మేరకు పాణ్యం నియోజకవర్గంలోకి వచ్చే వార్డులకు తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు శనివారం కర్నూలు జిల్లా పాణ్యం, కర్నూలు నియోజకవరాల పరిధిలోని పలు అర్బన్ వార్డుల్లో పర్యటించారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి చంద్రబాబు రోడ్డు మార్గంలో గుత్తిరోడ్ మీదుగా సీ.క్యాంప్ రైతు బజారుకు చేరుకున్నారు. అక్కడ రైతులతో మాట్లాడారు. కూరగాయాలు కొనుగోలు చేశారు. కూరగాయాల వ్యర్థాలను ఎరువులుగా తయారు చేసే ప్రక్రియను చంద్రబాబు పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో కలసి రైతు బజారులో పరిశీలించారు. ఎలాంటి సెక్యూరిటీ, రాష్ట్ర, జిల్లా అధికారులు దగ్గరకు రానివ్వకుండా చంద్రబాబు, ఇద్దరు పారిశుధ్య కార్మికులు అయ్యమ్మ, వెంకటేష్‌లతో మాత్రమే వెళ్లి రైతు బజారులో కలియతిరిగారు. అక్కడి నుంచి కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజావేదికకు చంద్రబాబు చేరుకున్నారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. పీ-4 విధానంలో భాగంగా అమలు చేస్తున్న మార్గదర్శి-బంగారు కుటుంబాలతో మాట్లాడారు.

మిగతా 6వ పేజీలో


పారిశుధ్య కార్మికులతో..






మొక్కను నాటి..



సి.క్యాంపు రైతు బజార్ వద్ద..



డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


మహిళా రైతుకు నమస్కరిస్తూ..


మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్మికులు, ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

డీఎస్సీకి 73,605 దరఖాస్తులు

- 39,997 మంది అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు 2645
- ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- జూన్ 6 నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ఒక్కో అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పురుషుల అభ్యర్థుల కంటే మహిళా అభ్యర్థులే ఎక్కువ ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు మొత్తం 2,645 ఉన్నాయి. ఈపోస్టుల కోసం మొత్తం అభ్యర్థులు 39,997 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం దరఖాస్తులు 73,605 వచ్చాయి. కర్నూలు జిల్లాలో 39,997 మంది అభ్యర్థులకు గానూ 16,535 మంది పురుషుల అభ్యర్థులు కాగా, 23,462 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి.

రిజర్వేషన్ల వారీగా పోస్టులు

ఓపెన్ కేటగిరిలో 1057 పోస్టులు, బీసీ-ఏ కేటగిరీలో 187, బీసీ-బీలో 259, బీసీ-సీలో 27, బీసీ-డీలో 186, బీసీ-ఈలో 99 పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాత తొలిసారి డీఎస్సీలోనే వర్గీకరణ ఆధారంగా పోస్టులు విభజించారు. నోటిఫికేషన్ ఎస్సీ కేటగిరి-1, 2, 3 పోస్టుల అభ్యర్థులను వేర్వేరుగా చూపించారు. ఎస్సీ-1 కేటగిరిలో 35, ఎస్సీ-2లో 173 పోస్టులు, ఎస్సీ-3 కేటగిరిలో 204 పోస్టులు, ఎస్టీలో-16, ఈడబ్ల్యూఎస్-257 పోస్టులు, సీహెచ్‌సీ కేటగిరిలో పోస్టులను చూపించలేదు. ఈనెల 30వ తేదీ నుంచి అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడు చేసుకోవచ్చు. మెగా డీఎస్సీ ఆన్‌లైన్ కంప్యూటర్ అధారిత పరీక్షలు (కంప్యూటర్ బేస్డ్) పరీక్షలు జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు షెడ్యూల్డ్‌లో ఇచ్చారు.

కర్నూలులో కుండపోత వాన

మూడు గంటల పాటు కురిసిన వర్షం


రాజ్‌విహార్ కూడలిలో కురుస్తున్న వర్షం





కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి మేఘావృతం కారణంగా చల్లదనం ఏర్పడింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏకధాటిగా ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎస్‌బీఐ సర్కిల్, కొండారెడ్డి బురుజు, ఎస్టీబీసీ కళాశాల, రాజ్‌విహార్, గుత్తిరోడ్డు, బస్టాండ్ ఎదురుగా, ఈద్గా సర్కిల్, గుత్తి రోడ్డు, నంద్యాల చెక్‌పోస్టు, బంగారుపేట తదితర కాలనీలన్నీ జలమయమయ్యాయి. ఏకధాటిగా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష

పరీక్షకు హాజరుకానున్న 1,500 మంది విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 17(ఆంధ్రజ్యోతి): ఐఐటీలో బీటెక్, బీఆర్క్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 ప్రవేశ పరీక్ష ఆదివారం జరగనుంది. జేఈఈ-మెయిన్స్‌లో కనీస స్కోరు సాధించిన అభ్యర్థులు మాత్రమే జేఈఈ-అడ్వాన్స్‌డ్ రాయడానికి అర్హులు. కర్నూలు జిల్లాలో దాదాపు 1500 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న సనత్‌నగర్ అయాన్ డిజిటల్ సెంటర్‌ను పరీక్షా కేంద్రంగా ఏర్పాటుచేశారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని పరీక్ష నిర్వాహకులు సూచించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరి స్తారని కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలి పా రు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, ము న్సిపల్ కా ర్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వ హిస్తారని, ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగిం చుకోవాలని తెలి పారు.

సమాచారం కోసం 1100కు ..

అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏదశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

ఎండుమిర్చి ధర క్వింటం గరిష్ఠంగా రూ. 8,410

ఆదోని అగ్రికల్చర్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం ఎండుమిర్చి ధరలు క్వింటాలు గరిష్ఠంగా రూ.8,410 వ్యాపారులు కొనుగోలు చేశారు. 75 క్వింటాళ్ల ఎండుమిర్చి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.2001, గరిష్ఠ ధర రూ.8410, మధ్య ధర రూ.6208 పలికింది.

మాటల్లో చెప్పలేని సంతోషం

- నాటి నిర్ణయం నేడు వేలాది మందికి ప్రయోజనం
- సీ.క్యాంపు రైతుబజార్ పర్యటనలో ఆనందం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- 45 నిమిషాల పాటు రైతులతో ముఖాముఖి


రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్/న్యూసిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): 'ఈ సంతోషం మాటల్లో చెప్పలేకపోతున్నా.. మొదటిసారిగా 1999లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడే రైతుల సంక్షేమం, మహిళలు, అన్నివర్గాల ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచన నుంచి పుట్టిందే రైతుబజార్ల వ్యవస్థ. రైతులు పొలాల్లో పడుతున్న కష్టానికి లాభం పొందడంతో పాటు అదే రీతిలో ప్రజలకు నాణ్యమైన కూరగాయలు తాజావి అందించాలనే ధ్యేయంతో రైతుబజార్ల ఏర్పాటుకు కృషి చేశాను' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కర్నూలులోని సి.క్యాంపు రైతు బజార్‌లో పర్యటించి రైతులు, పొదుపులక్ష్మి మహిళలతో మాట్లాడినప్పుడు వారి కళ్లలో కనిపించిన ఆనందం చూసి ఎంతో సంతోషించానని సీఎం అన్నారు. దాదాపు 45 నిమిషాలు సి.క్యాంపు రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు ఎంతో ఉల్లాసంగా...ఉత్సాహంగా రైతుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

యువరైతుకు ముఖ్యమంత్రి అభినందన

సూర్యప్రకాష్‌రెడ్డి ఎంఎస్సీ (బోటని) చదివారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం తాపలకొత్తూరులో తనకున్న 20 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు ప్రకృతి సేద్యంతో పండిస్తున్నారు. అక్కడి ఆహార ఉత్పత్తులను సి.క్యాంపు రైతుబజార్‌లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం చేయకముందు కొన్ని నెలలు హైదరాబాద్‌లో ఉద్యోగం చేశానని, అయితే సంతృప్తి లేకపోవడంతో ఉన్న పొలంలోనే పంటలు సాగు చేస్తూ లాభం పొందుతుండటమే కాక పదిమందికి ఆరోగ్యాన్ని ఇచ్చే ఆహార ఉత్పత్తులను విక్రయిస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ సూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో తన అనుభవాలను పంచుకున్నారు. మీలాగే చదువుకున్న వారంతా ఉద్యోగాలపై ఆధారపడకుండా కష్టపడితే మంచి ఫలితం ఉంటుందని నిరూపించావంటూ సీఎం చంద్రబాబు ఆ యువరైతును అభినందించారు. యువరైతుతో కలిసి సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గ్రూప్ ఫొటో దిగారు.

సీఎం పర్యటన సాగిందిలా...

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌లో పర్యటించారు.

- మధ్యాహ్నం 1.30 గంటలకు సి.క్యాంపు రైతు బజారుకు వచ్చారు.
- 45 నిమిషాలపాటు రైతులతో ముఖాముఖి..అధికారులకు వివిధ అభివృద్ధి పనులపై ఆదేశాలు
- కూరగాయల నిల్వ కోసం రైతు శ్రీరాములు ఏర్పాటు చేసుకున్న ఫ్రీజర్ పరిశీలన
- చెత్తశుద్ధి యంత్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- పారిశుధ్య కార్మికులకు సన్మానం
- 2.13 నిమిషాలకు రైతుబజార్‌లో పర్యటన ముగించుకుని అక్కడే రోడ్డుపై వేచిచూస్తున్న ప్రజలకు అభివాదం తెలుపుతూ సభా వేదికకు బయలుదేరారు.

సెట్వ్కార్ శాఖ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ

సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన ప్రజల సమస్యలను వినతుల రూపంలో స్వీకరించేందుకు సెట్వ్కార్ శాఖను కలెక్టర్ నియమించారు. ఈ మేరకు సి.క్యాంపు రైతుబజార్ వద్ద సెట్వ్కార్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై వినతులను స్వీకరించారు.

మా కుటుంబం మీకు రుణపడి ఉంటుంది



కుటుంబ సభ్యులను పోషించుకునే దారి తెలియక కొన్ని సంవత్సరాలు చాలా ఇబ్బందులు పడ్డానని, తమ కుటుంబం మీకు రుణపడి ఉంటుందని పొదుపు మహిళ పార్వతమ్మ సీఎం చంద్రబాబుతో అన్నారు. ఈ రైతుబజార్‌లో పొదుపు లక్ష్మీ గ్రూపు మహిళగా కూరగాయల వ్యాపారం చేసేందుకు అవకాశం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ ఎంతో సాఫీగా సాగుతోందన్నారు. సీఎం మాట్లాడుతూ మీలాగే ధైర్యం తెచ్చుకుని మహిళలంతా ఏదో ఒక ఉపాధి పొందాలని మీకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని చంద్రబాబు పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు హామీ ఇచ్చారు.

- పార్వతమ్మ, పొదుపు మహిళ

పండ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా



పండ్ల వ్యాపారంతో చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన పొదుపు మహిళ సుజాత అన్నారు. తన భర్త రామదాసు దివ్యాంగుడు కావడం వల్ల ఈ రైతు బజార్‌లో పండ్లను విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని సీఎం చంద్రబాబుతో చెప్పారు. సీఎం మాట్లాడుతూ పొదుపు లక్ష్మీ గ్రూప్ ఉద్యమాన్ని తానే అంకురార్పణ చేశానని ఈ రోజు మా ప్రభుత్వానికి కొండంత అండగా మీరు ఉన్నారని సీఎం తెలిపారు. - సుజాత, పొదుపు మహిళ

పూల వ్యాపారంతో ఉపాధి



సి.క్యాంపు రైతు బజార్‌లో పూల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నానని చిన్నటేకూరుకు చెందిన గాయత్రి తెలిపారు. తన భర్త అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చనిపోయారని, అప్పటి నుంచి కుటుంబ పోషణకు తనకున్న 40 సెంట్ల పొలంతో పాటు మరో రెండు ఎకరాలను గుత్తకు తీసుకుని వివిధ రకాల పూలు పండిస్తూ విక్రయిస్తున్నానని చెప్పారు. పింఛన్ కోసం మూడేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాని, ఎవ్వరు పట్టించుకోలేదని ముఖ్యమంత్రికి తన గోడును మొరపెట్టుకున్నారు. దీంతో ఉన్నతాదికారుల నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు.

-గాయత్రి

మామిడి సాగుతో ఏటా రూ.లక్షన్నర ఆదాయం




సేంద్రియ ఎరువులతో మామిడి పంటను సాగుచేసి రైతు బజార్‌లో వాటిని అమ్ముకుంటూ ఏటా రూ.లక్షన్నర ఆదాయం పొందుతున్నట్లు రైతు నాగేశ్వరరావు తెలిపారు. రైతు బజార్ వల్ల ఉపాధి పొందుతున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహమందిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

- నాయకల్లు నాగేశ్వరరావు

గోరుకల్లు నుంచి తాగునీరు

(5వ పేజీ తరువాయి)

జిల్లా పర్యటన కోసం అమరావతి నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి 12.30 గంటలకు చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, పార్థసారథి, కేఈ శ్యాంబాబు, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, మాజీ మంత్రులు ఏరాసు ప్రతాప్‌రెడ్డి, కేఈ ప్రభాకర్, కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. రైతు బజార్ నుంచి సీఎం చంద్రబాబు నేరుగా నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో మాట్లాడారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల ప్రజలకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటిని మళ్లించి శుద్ధిచేసి అందిస్తామని హామీ ఇచ్చారు. ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా మారుస్తామని అన్నారు. ఇండస్ట్రియల్ నోడ్ కింద రూ.2,860 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని, రైల్వేలైన్, నీటి వసతి ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వివరించారు.





దేశానికే తలమానికం గ్రీన్ ఎనర్జీ

ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడ గ్రీన్‌కో సోలార్ పవర్ యూనిట్, పంప్డ్ స్టోరేజ్ యూనిట్, జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమ, డీఆర్‌డీవో వచ్చాయి. మరి న్ని పరిశ్రమలు రాబోతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. రాయలసీమలో ఉత్పత్తి చేసే గ్రీన్ ఎనర్జీ దేశానికే తలమానికంగా నిలిచింది. ఉమ్మడి కర్నూలు ప్రజలు నన్ను గౌరవించారు. వారి రుణం తీర్చుకుంటానన్నారు.

ఓర్వకల్లు పాలకోవా బ్రహ్మాండం

'ఒకనాడు పేదరికంలో ఎన్నో కష్టాలు పడ్డారు. నేను తీసుకొచ్చిన పొదుపు ఉద్యమం ద్వారా ఆర్థికంగా బలోపేతమయ్యారు. ఐదు బంగారు కుటుంబాలకు మార్గదర్శకులై ఓర్వకల్లు పొదుపు మహిళలు ఆదర్శంగా నిలిచారు. ఓర్వకల్లు పాలకోవా బ్రహ్మాండంగా ఉంటుంది. డ్వాక్రా, మెప్మా ద్వారా మరింత ప్రోత్సాహం అందిస్తాం. డ్వాక్రా సంఘాలంటే రాజకీయ నాయకులకు భయం. గ్రామాల్లో వారికి మంచి గౌరవం ఉంటుంది. ఇక్కడ ఉన్న ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత ఇద్దరూ మహిళలు. వారిని చట్టసభలకు పంపిన ఘనత టీడీపీదే' అని చంద్రబాబు అన్నారు.






చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు


స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

కాటసాని కబ్జాలపై విచారణ కమిటీ వేయాలి

వైసీపీ హయంలో పాణ్యం నియోజకవర్గంలో కబ్జాలు విచ్చలవిడిగా జరిగాయి. పది మంది టీడీపీ కార్యకర్తల్లో ఒకరి ఆస్తులు కబ్జాకు గురయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూకబ్జాలపై విచారణ కమిటీ వేయాలి. ఒక మహిళలను ఎంపీ చేయడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ కమిటీల్లో సభ్యురాలిగా చేర్చి గుర్తింపు ఇచ్చారు. రాయలసీమ సస్యశామలం చేయడానికి సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు.

- బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ

ధనలక్ష్మినగర్ పార్కును సుందరీకరించండి

సీఎం చంద్రబాబు నాయుడు


పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం చంద్రబాబు

కర్నూలు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధనలక్ష్మినగర్‌లో ఉన్న పార్కును 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో భాగంగా సుందరీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం పార్కు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ పార్కును జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పైలాన్ ఆవిష్కరించారు. పార్కును అభివృద్ధి చేసేందుకు పురపాలక మంత్రి నారాయణ సూచనలు తీసుకోవాలని జైరాజ్ కంపెనీ యజమానిని ఆదేశించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సుందరీకరణ వివరాలను ఏపీ గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు సీఎంకి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి పార్కులో చెట్లు నాటారు.

పాణ్యంను ఆదర్శంగా తీర్చుదిద్దుతా

సీఎం చంద్రబాబు స్ఫూర్తి, సహకారంతో పాణ్యం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుదిద్దుతా. ఓర్వకల్లుకు రూ.2,860 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మంత్రివర్గం, అసెంబ్లీలో ఆమోదం తెలిపారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న సీఎంకు ధన్యవాదాలు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు గోరుకల్లు నుంచి పైపులైన్ వేయాలి. గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్లు మరమ్మతులు చేయాలి. విస్తరిస్తున్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయాలి. సఫా కాలేజీ నుంచి నంద్యాల చెక్ పోస్టు వరకు నాలుగు రోడ్ల రహదారి నిర్మించాలి. ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాలు పూర్తి చేయాలి.

- గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యే

సీ.క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు

'మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి మేరకు సి.క్యాంప్ రైతు బజారు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నాను. అండర్‌గ్రౌండ్‌లో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తా. రాష్ట్రంలోనే ఉత్తమ రైతు బజారుగా తీర్చిదిద్దుతా..' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు బజారులో పర్యటిస్తూ పండ్లు, పూలు, కూరగాయలు అమ్మే రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు.. రోజుకు ఎంత వ్యాపారం జరుగుతుంది.. ఏడాది ఆదాయం ఎంత వస్తుంది వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించి ప్రతి రైతు బజారులో ఇలాంటివి ఏర్పాటు చేయాలని కలెక్టరుకు చెప్పారు.

సీఎం దిశా నిర్దేశంతో జిల్లా ప్రగతి

సీఎం చంద్రబాబు దిశా నిర్దేశంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నాం. జిల్లాలో ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పక్కాగా అమలు చేస్తున్నాం. 4 లక్షల మందికిపైగా ప్రజలు, ఉద్యోగులు పాల్గొంటారు. పీ-4 కార్యక్రమంలో జిల్లాలో అమలు చేస్తున్నాం. జిల్లాలో 20 శాతం మంది ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించాం. 55 మంది మార్గదర్శకులను కూడా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశాం. ముఖ్యమంత్రి విజన్ మేరకు ఈ పది నెలల్లో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఓర్వకల్లు హబ్‌లో 5 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ నోడ్ వస్తుంది. వీటి ద్వారా 6 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి.

- పి.రంజిత్ బాషా, కలెక్టర్

శాశ్వత అధికారమే లక్ష్యం..

- ప్రతి కార్యకర్త పనిచేయాలి ● అందరికీ న్యాయం చేస్తా
- ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్ట పరచాలి
- 'నీరు-చెట్టు' బాధ్యత కార్యకర్తలదే
- ప్రధాని మోదీలా ఐదుసార్లు అధికారంలో ఉండాలి
- కాటసాని కబ్జాలపై కమిటీ వేసి న్యాయం చేస్తాం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

కర్నూలు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): శాశ్వత అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం నగర శివారులో పాణ్యం నియోజకవర్గ టీడీపీ కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీలా ఐదు సార్లు అధికారంలో ఉండేలా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని పటిష్ట పరిచాలని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రశాంత జీవనం గడిపేలా పీ-4 కార్యక్రమాన్ని చేపట్టానని, ప్రజలతో పాటు ప్రతి కార్యకర్త ఆర్థికంగా బలపడాలని సూచించారు. ప్రతి నాయకుడి, కార్యకర్తకు సంబంధించిన పూర్తి సమాచారం తన దగ్గర ఉందని తెలిపారు. 'నీరు-చెట్టు' పనులన్నీ కార్యకర్తల ద్వారానే పూర్తిచేసేందుకు ఆదేశించామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేసిన కబ్జాలపై కమిటీ వేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడాలని, అందరికీ న్యాయం చేస్తానని, నిరుత్సాహ పడవద్దని భరోసా ఇచ్చారు. దాదాపు 650మంది కార్యకర్తలు హాజరుకాగా అందులో ఐదు మంది బెస్ట్ కార్యకర్తల కింద ఎంపిక చేసి వారితో చంద్రబాబు మాట్లాడారు. కల్లూరు మండలానికి చెందిన ఓకార్యకర్త తనకు ఉండేందుకు ఇల్లు లేదని ఏళ్లుగా పార్టీకి అంకితమై పని చేస్తున్నానని తెలిపారు. స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ తనసొంత నిధులు రూ.3లక్షలతో ఇంటి నిర్మాణానికి అందజేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు బీసీ జనార్థన్‌రెడ్డి, ఫరూక్, ఎంపి బైరెడ్డి శబరీ, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు


హాజరైన పాణ్యం టీడీపీ శ్రేణులు

రైతులతో ముచ్చట

- కూరగాయల ధరలు, లాభాల గురించి తెలుసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు
- అందరి వద్దకు వచ్చి పలకరించడంతో ఆశ్చర్యపోయిన అన్నదాతలు

కర్నూలు న్యూసిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతు బజార్‌లో ఒక సామాన్యుడిగా తిరిగారు. ఎలాంటి మంది మార్బలం.. అధికారులు ఎవరూ లేకుండా కేవలం ఇద్దరు పారిశుధ్య కార్మికులతో కలిసి రైతు బజార్ మొత్తం చుట్టేశారు. అక్కడ రైతులతో వ్యక్తిగతంగా మాట్లాడటంతో పాటు వారి బాగోగులు.. కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారాల నుంచి వస్తున్న లాభనష్టాల గురించి ఆసక్తికరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి వద్దకు సీఎం ఒక్కరే వచ్చి పలకరిస్తుండటంతో రైతులు, వ్యాపారులంతా అవాక్కయ్యారు. తమ వద్దకు వచ్చి మాట్లాడుతున్నది సీఎం చంద్రబాబేనా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రతి మనిషిని పలకరించారు. అంతే కాకుండా కూరగాయలు, పండ్లు కూడా కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వు కనిపించింది. అంతే కాకుండా రైతు బజార్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన చెత్తశుద్ధి యంత్రాన్ని పారిశుధ్య కార్మికులతో కలిసి సీఎం స్వయంగా పరిశీలించారు. అది ఎలా పని చేస్తుంది.. దాని వల్ల లాభాలు ఏమిటని కార్మికులని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.


సబ్జికూలర్ గురించి రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం

సబ్జికూలర్ గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి

రైతుబజార్‌లో సీఎం చంద్రబాబు పర్యటనలో సబ్జికూలర్ ప్రత్యేకంగా నిలిచింది. ఎన్నడూ లేని విధంగా అది కొత్తగా కనిపించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని ఏర్పాటు చేసిన రైతు శ్రీరాములను దాని గురించి సుమారు పదినిమిషాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో కేవలం సబ్జి(ఉల్లిగడ్డలు) మాత్రమే నిల్వ చేసుకోవచ్చా? లేకుంటే మిగిలిన కూరగాయలు కూడా నిల్వ చేసుకోవచ్చా అని సీఎం తెలుసుకున్నారు. సబ్జి కూలర్ గురించిన వివరాలను రైతులు ముఖ్యమంత్రికి వివరించారు.

కీరదోసకాయలు కొనుగోలు చేసిన సీఎం

కీరదోసకాయలు బాగున్నాయి.. ఎంతకి ఇస్తారని సీఎం చంద్రబాబు నాయుడు రైతుబజార్‌లో మహిళా రైతుని అడిగారు. కిలో ధర రూ.40 అని చెప్పారు. ముఖ్యమంత్రి స్వయంగా కిలో దోసకాయలను తూకం వేసుకొని కొనుగోలు చేశారు. అనంతరం డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లించారు.

మిరపకాయలను చెత్తబుట్టలో వేసిన చంద్రబాబు

రైతుబజార్‌లో పర్యటిస్తుండగా సీఎం చంద్రబాబుకు నాలుగు మిరపకాయలు కిందపడి ఉన్నాయి. దీంతో వెంటనే మిరపకాయలను తీసుకుని చెత్తబుట్టలో వేశారు. పక్కనే ఉన్న పారిశుధ్య కార్మికుడు తాను తీస్తానని చెప్పినా స్వయంగా తానే వేశారు.


మిరపకాయలను చెత్తబుట్టలో వేస్తున్న సీఎం

చంద్రబాబుకు ఘన స్వాగతం



విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు జయసూర్య, కేఈ శ్యాంబాబు, పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు ఏరాసు ప్రతాప్ రెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి, మాండ్ర శివానందరెడ్డి



చంద్రబాబుకు శ్రీవారి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఎంపీ బైరెడ్డి శబరి



టీడీపీ రాష్ట్ర నాయకులు వహీద్ హుస్సేన్, ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, ఎన్.రాఘవేంద్ర రెడ్డి, ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ




గ్రీన్‌కో ప్రతినిధులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు



అడ్డదారిలో అక్రమ రవాణా..!

- ఫేక్ బిల్లులతో వరి బస్తాల తరలింపు
- రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కడప జిల్లాతో పాటు బేతంచెర్లలో లభ్యమైన నకిలీ బిల్లులు
- ఆలస్యంగా వెలుగులోకి...
- వ్యాపారిపై అవుకు పోలీసులకు ఫిర్యాదు



నకిలీ బిల్లులు ఇలా...

నంద్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎలాంటి పన్ను(సెస్) చెల్లించకుండా ఏకంగా ఓ వ్యాపారి ఫేక్ బిల్లులతో వరి బస్తాలను అడ్డదారిలో అక్రమ రవాణా చేసి రూ.లక్షల్లో సొమ్ముచేసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 10 లారీల్లో బస్తాలను అక్రమంగా ఓ వ్యాపారి తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టాడు. చెక్ పోస్టుల్లో తమ వాహనాలను పట్టుకోకుండా ఉండేందుకు వీలుగా పది రోజుల రోజుల క్రితం కడప జిల్లా 'వ్యవసాయ మార్కెట్ కమిటీ' కమలాపురం పేరుతో ఫేక్ బిల్లులు సృష్టించి వరి బస్తాలను హైదరాబాదు, నెల్లూరు, కర్ణాటకకు తరలించి రూ.లక్షల్లో క్యాష్ చేసుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నిబంధనల ప్రకారం ఏ వ్యాపారి అయినా వరి బస్తాలను లోడులో 25 టన్నులు తరలిస్తే.. మార్కెట్‌కు రూ.10వేలు, 30 టన్నులు తరలిస్తే రూ.12 వేలు చొప్పున పన్ను(సెస్) చెల్లించాల్సి ఉంటుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలోని అవుకు మండలానికి చెందిన ఓ వ్యాపారి కడప జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కమలాపురం పేరుతో ఫేక్ బిల్లులు సృష్టించి గత కొంతకాలంగా మార్కెట్‌కు ఎలాంటి పన్ను చెల్లించకుండా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నాడు. తాజాగా పది రోజుల క్రితం కడప జిల్లా మీదుగా నెల్లూరుకు ఓ లారీ వెళ్లింది. ఆ తర్వాత కమలాపురం చెక్‌పోస్టులో ఆ శాఖ అధికారులు రికార్డులను పరిశీలిస్తుండగా.. సదరు వ్యాపారి ఫేక్ బిల్లుల విషయం బయట పడింది. దీంతో వెంటనే సదరు అధికారులు ఆశాఖ జేడీ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐదు రోజుల క్రితం జేడీ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏడీ అబ్దుల్ రెహమాన్‌ను తీవ్రస్థాయిలో ఆదేశించారు.

● బేతంచెర్లలో వెలుగులోకి...

జేడీ ఆదేశాలతో సదరు ఏడీ దర్యాప్తు ముమ్మరం చేయగా.. జిల్లాలోని 24 చెక్ పోస్టుల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో బేతంచెర్ల చెక్‌పోస్టులో సేమ్ ఫేక్ బిల్లులతో పలుమార్లు వెళ్లినట్లు నిర్ధారణ అయిందని సమాచారం. దీంతో అక్కడి బిల్లులతో పాటు ఇక్కడి బిల్లులను స్వాధీనం చేసుకుని లారీలు ఎప్పుడెప్పుడు వెళ్లాయో లోతుగా విచారణ చేస్తున్నారని సమాచారం. అయితే అక్రమంగా తరలించిన లారీలకు సంబంధించిన యజమాని డోన్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. సదరు వ్యక్తి సమాచారంతో అక్రమ రవాణాకు పాల్పడిన వ్యాపారి అవుకు మండలానికి చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా అక్రమాలకు పాల్పడిన ఆ బియ్యం వ్యాపారి హైదరాబాదు, కర్ణాటకలోని శిరిగుప్ప, నెల్లూరు, చెన్నై ప్రాంతాలకు ఎక్కువగా వరి బస్తాలను తరలిస్తున్నట్లు తెలిసింది.

అవుకు పోలీసులకు ఫిర్యాదు

తాజాగా లభ్యమైన ఫేక్ బిల్లుల ఆధారంగా చెక్‌పోస్టులో నమోదైన లారీ యజమాని చెప్పిన వివరాలను ఆధారంగా చేసుకుని ఆశాఖ అధికారులు రెండు రోజుల కిందట సదరు వ్యాపారిపై అవుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. అయితే సదరు వ్యాపారి కేసులో తాను లేకుండా చూసేందుకు పోలీసులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయితే సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులు తగిన ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫేక్ బిల్లులు వాస్తవమే



ఫేక్ బిల్లులతో వరి బస్తాలను ఓ వ్యాపారి అక్రమంగా తరలించారనే విషయం వాస్తవమే. ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు దర్యాప్తు చేశాం. కొన్ని ఆధారాలతో సదరు వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. భవిష్యత్‌లో అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులను పటిష్టం చేస్తాం. ఇలాంటి అక్రమ వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచుతాం.

\- అబ్దుల్ రెహమాన్, ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ

బావిలో పడి విద్యార్థి మృతి

ఆత్మకూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో కుందూరు చరణ్‌కుమార్‌రెడ్డి (16) అనే విద్యార్థి శనివారం మధ్యాహ్నం ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సీఐ రాము తెలిపిన వివరాలివీ.. వెంకటాపురం గ్రామ నివాసి అయిన కుందూరు రామచంద్రారెడ్డి కుమారుడు కుందూరు చరణ్‌కుమార్‌రెడ్డి 9వ తరగతి పూర్తయింది. వేసవి సెలవులు కావడంతో శనివారం తన తోటి స్నేహితులతో కలిసి వెంకటాపురం గ్రామ శివార్లలోని ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడి బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. చరణ్‌కు ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని స్నేహితులు అక్కడ పొలాల్లో పని చేసే వారికి తెలిపారు. రైతులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేక పోయింది. బావిలో నీరు అధికంగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో గ్రామస్థులు చరణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా అప్పటికే చరణ్ నీళ్లలో ఊపిరాడక చనిపోయాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు అకస్మాత్తుగా చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచివేసింది. ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం చరణ్ మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీబీకి చిక్కిన ఉద్యోగులు కోర్టుకు హాజరు

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటున్న ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ డీఈఈ రవికాంత్ చౌదరి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను సీబీఐ కోర్టుకు హాజరుపరిచారు. ఏసీబీ అధికారులు శనివారం కర్నూలులోని సీబీఐ కోర్టు న్యాయాధికారి శోభారాణి ముందు అవినీతి ఉద్యోగులను హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు క్రిష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభం ఏర్పాటు

రుద్రవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన రైతు యడవల్లి లింగమూర్తి పొలంలో విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. శనివారం విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు లింగమూర్తి పొలంలో రెండు విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను సబ్ ఇంజనీర్ రాజశేఖర్ దగ్గరుండి ఏర్పాటు చేయించారు.

ప్రతిపక్షాల నోరు నొక్కడం మానుకోవాలి

- కాంగ్రెస్ నాయకుల అరెస్ట్ దారుణం
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



లక్ష్మీనరసింహ యాదవ్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నంద్యాల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల నోరు నొక్కడం మానుకోవాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శనివారం కర్నూలుకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుంటే కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారిని రాష్ట్రప్రభుత్వం మోసంచేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ చాలా పథకాలు మరుగునపడ్డాయని ఎద్దేవా చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- రూ.35లక్షలు చెల్లించకుండా ఉడాయించిన వ్యాపారి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్యాపిలి, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యాపారి చిట్టీల పేరుతో దగా చేశాడు. ప్రజలకు చెల్లించాల్సిన రూ.35లక్షల చిట్టీ డబ్బులతో ఉడాయించాడు. దీంతో బాధితులు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వ్యాపారిపై ఫిర్యాదు చేశారు. పట్టణంలోని క్రిందిగేరిలో నివాసముంటున్న షేక్ సుభాన్ అనే వ్యక్తి ఐదారేళ్లుగా రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. ప్రారంభంలో చిట్టీ ఎత్తిన వెంటనే డబ్బులు చెల్లిస్తూ ప్రజలను నమ్మించాడు. దీంతో పలువురు షేక్ సుభాన్ దగ్గర చిట్టీలు కట్టేవారు. అయితే రెండేళ్లుగా చిట్టీలు ఎత్తిన వారికి డబ్బులు సరిగా చెల్లించలేదు. డబ్బుల గురించి అడిగితే మాయ మాటలు చెప్పి దాటవేసేవాడు. 20రోజుల నుంచి వ్యాపారి కనిపించడం లేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. దీంతో ఆందోళన చెందిన సభ్యులు వ్యాపారి ఇంటి దగ్గర వెళ్లి ఆరా తీశారు. కుటుంబ సభ్యుల నుంచి సరైన సమాధానం లేకపోవ డంతో కంగుతిన్న బాధితులు నరేంద్రకుమార్, ప్రభాకర్‌రెడ్డి, షేక్ హుసేన్, వెంకటేశ్, సర్వర్ సాహేబ్ తదితరులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. దగాచేసిన వ్యాపారిపై ఎస్ఐ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. పరిహారం అందించరూ

- కలెక్టర్‌కు పంచలింగాల, ఈ.తాండ్రపాడు వాసుల మొర

కర్నూలు అగ్రికల్చర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములను ఇచ్చామని, నష్టపరిహారం అందించాలని పంచలింగాల, ఈ.తాండ్రపాడు వాసులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. శనివారం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి తమ ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి 119.88 ఎకరాల భూమిని ఇచ్చినట్లు తెలిపారు. 2015లో ఆర్డీవో ఎకరానికి రూ.6,17,326లు వడ్డీ తదితర అన్ని కలిపి పరిహారంగా అందించేందుకు నిర్ణయించారు. అయితే.. ఈ మొత్తం మాకు సరిపోదని, మార్కెట్ విలువ మేరకు నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నామన్నారు. ఎకరాకు రూ.38,72,000 రైతులకు చెల్లించాలని, అప్పట్లో కోర్టు ఆ మొత్తాన్ని ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఇప్పటి దాకా ఆపరిహారాన్ని అందించకుండా అధికారులు నిర్లక్ష్యం చూపుతూ వచ్చారన్నారు. నష్టపరిహారం అందించడంలో జరిగిన జాప్యాన్ని, నిర్లక్ష్యాన్ని గుర్తించి పరిహారం అందించాలని కలెక్టర్ విన్నవించుకున్నట్లు రైతుల పోరాట సమితి ప్రతినిధులు నాగరాజు, వెంకటేశ్వర్లు, లింగన్న, గిరిజ, పద్మ, మద్దిలేటి, సునీత, నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయమ్మ, అయ్యన్న, శ్రీరాములు తెలిపారు

ఇంటర్ పరీక్షల్లో 595 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శనివారం మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 595 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో 7,363 మంది విద్యార్థులకు గానూ 6859 మంది హాజరు కాగా 504 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1306 మంది నమోదు చేసుకున్నారు.1215 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 91 మంది గైర్హాజరయ్యారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యా ర్థులు 595 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

క్షణికావేశంలో ఇనుపరాడ్డుతో కొట్టి హత్య



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి

- ఆనవాళ్లు లేకుండా యాసిడ్ పోసి శవం కాల్చివేత
- ఎముకలను దంచి పొడిచేసి పెట్రోల్ పోసి దహనం
- గువ్వల రాజు హత్య కేసులో నిందితుల అరెస్టు
- ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్డు స్వాధీనం
- పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి
- కేసును ఛేదించిన పోలీసులకు ప్రశంసలు

పాణ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి క్షణికావేశంలో ఇనుపరాడ్డుతో కొట్టి గువ్వల రాజును హత్యచేసినట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పాణ్యం సర్కిల్ పరిధిలోని గడివేములలో ఇటీవలే జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టుచేశారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి సీఐ వివరాలు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన గడివేములకి చెందిన గువ్వల జనార్దన్ తన తమ్ముడు గువ్వల రాజు 14రోజుల నుంచి కనబడటం లేదని గడివేముల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. 10వ తేదీన గ్రామ పొలిమేరలోని అబ్దుల్‌రహిమాన్ పొలంలో గుర్తుతెలియని ఎముకలు ఉన్నాయని వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు పాణ్యం, గడివేముల ఎస్ఐలు నరేంద్రకుమార్‌రెడ్డి. నాగార్జున రెడ్డి వెళ్లి పరిశీలించారు. ఎముకలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గువ్వల రాజుతో పాటు కలిసి తిరిగేవారి వివరాలు సేకరించారు. వీరిలో కె. బొల్లవరం గ్రామానికి చెందిన మేకల మహేంద్ర, బిలకలగూడూరుకు చెందిన కొత్త లోకేశ్ గువ్వలరాజును బైక్‌పై అబ్దుల్‌రహీం మొక్కజొన్న పొలం వద్దకు తీసుకెళ్లారు. ముగ్గురు మద్యం సేవించారు. మాటమాట పెరిగి క్షణికావేశంలో మహేంద్ర గువ్వలరాజు తలపై ఇనుపరాడ్డుతో కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. రాడ్డును సమీప కుందూ వాగులో వేసినట్లు తెలిపారు. ఆ తర్వాత శవాన్ని గుర్తుపట్టకుండా చేయాలనే ఉద్దేశంతో మేకల మహేంద్ర, తన స్నేహితుడు గడివేముల గ్రామానికి చెందిన మానికింది పెద్దరాయుడుతో కలిసి 24వతేదీ, 26న తేదీలలో శవం ఆనవాళ్లు లేకుండా యాసిడ్ పోసి కాల్చివేశారు. ఎముకులు ఎరుకొని రాళ్లతో దంచి పొడిచేసి వాటిపై పెట్రోల్ పోసి దహనం చేశారన్నారు. బూడిదను దగ్గరలోని కుందూలో వేసినట్లు తెలిపారు. నిందితులను ఈనెల 16వ తేదీన గడివేముల పరిధిలో అరెసుచేసి వారివద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు, ఐరన్‌రాడ్డు, చున్నీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా త్వరితగతిన కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న నంద్యాల డీఎస్పీ మందా జావళి, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలను ఉన్నతాధికారులు అభినందించారు.

కోడుమూరులో భారీ వర్షం

విరిగిన చెట్టు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు



క్రిష్ణాపురంలో విరిగి పడిన చెట్టు కొమ్మ

కోడుమూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారుజామున సుమారు గంటకుపైగా భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు, వర్షం ప్రభావంతో పట్టణంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. స్థానిక సంత మార్కెట్ సమీపంలో బజారి, సాలమ్మ దంపతులకు చెందిన పూరి గుడిసె గోడకూలి, రేకులు లేచి పడ్డాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చిన్నారులను తీసుకుని బయ టకు రావడంతో ప్రమాదం తప్పింది. దీంతో పూరిగుడిసె దెబ్బతిని, తిండి గింజలు పాడైపోయాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే క్రిష్ణాపురంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఇళ్లమధ్య చెట్లకొమ్మలు విరిగి మిద్దెలపై పడ్డాయి. మండలంలో 33.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

సర్పంచ్ దంపతుల ఉదారత: కోడుమూరు పట్టణంలో పూరిగుడిసె కూలి, తిండిగింజలు తడిసిపోవడంతో వీధినపడ్డ బజారి కుటుంబాన్ని సర్పంచ్ భాగ్యరత్నమ్మ, ఆంధ్రయ్య దంపతులు పరామర్శించారు. వారికి సర్పంచ్ దంపతులు రూ. 10,500 ఆర్థికసాయం చేశారు. ఈవో అజయ్‌భాస్కర్, ఉపసర్పంచ్ మాదులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించిన గాడిచర్ల మనువడు



గాడిచర్ల మనువడు ఎంసీ మోహనకృష్ణను సత్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, మహాత్మాగాంధీ అనుచరుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు మనువడు ఎంసీ మోహనకృష్ణ శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. ఆయనతోపాటూ ద్రవిడ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎం.దొరస్వామి నాయుడు, ఎస్వీయూ ఆచార్యులు డాక్టర్ కె. సురేంద్రబాబు, రాష్ట్ర గ్రంథాలయ శిక్షణాలయం కార్యదర్శి రావి శారద, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మనోహర్‌రావు విచ్చేశారు. ఈ సందర్భంగా వారిని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్, ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క సాదరంగా ఆహ్వానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలోని గాడిచర్ల విగ్రహానికి, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గాడిచర్ల చిత్రపటానికి వారు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారిని శాలువతో సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ అధ్యక్షుడు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డి, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, మగ్బుల్ బాషా, విద్యావేత్తలు చంద్రశేఖర్, లక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధన



మొక్క నాటుతున్న పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), మే 17(ఆంధ్రజ్యోతి): అందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర సాధ్యమని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజ నీరు పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పాణ్యం సిమెంట్స్, జియో మైసూరు, జేఎస్‌డబ్ల్యూ, రాంకో, రెయిన్ సిమెంట్స్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదాం: కమిషనర్



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

గూడూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సహకారంతో గూడూరు నగర పంచాయతీని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదామని కమిషనర్ రమేష్ బాబు అన్నారు. శనివారం గూడూరులో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మేనేజర్ విజయలక్ష్మి, శానిటరీ ఇన్ స్పెక్టర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుట్టపాడులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు దారుణం

కర్నూలు క్రైం, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు పర్యటన సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం దారుణమని నంద్యాల పార్లమెంటు పార్టీ జిల్లా అధ్య క్షుడు జె.లక్ష్మినరసింహ యాదవ్ ఆరోపించారు. వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులను అరెస్టు చేసి ఉలిందకొండ, కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్లకు తరలించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కర్నూలు సిటీ అధ్యక్షుడు జిలానీ బాషా, డోన్ ఇన్‌చార్జి మద్దిలేటి, నందికొట్కూరు ఇన్‌చార్జి నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

కోడుమూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు వైపు వస్తున్న కారు, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. కారులో ఒకరికి స్వల్పగాయాలైనట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.







సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

సీఎంకు ఘన స్వాగతం





ప్రత్యేక బస్సులో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గౌరుచరిత, ఎంపీ బైరెడ్డి శబరి, గజమాలలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఓర్వకల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కర్నూలు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పటేల్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, పార్థసారధి, జయసూర్య, ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, తిరుమలనాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, స్టేట్ కురువ, బోయ, రజక కార్పొరేషన్ల చైర్మన్లు దేవేంద్రప్ప, కపట్రాళ్ల బొజ్జమ్మ, సావిత్రి, టీటీడీ బోర్డు మెంబరు మల్లెల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు ఏరాసు ప్రతాపరెడ్డి, కోట్ల సుజాతమ్మ, కేఈ ప్రభాకర్, భూమా బ్రహ్మానందరెడ్డి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, గౌరు వెంకటరెడ్డి, మాంద్ర శివానందరెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి, ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు చింతా సురే ష్‌బాబు, కేవీ సుబ్బారెడ్డి, వైకుంఠం జ్యోతి, ఏవీ సుబ్బారెడ్డి, ఎల్వీ ప్రసాద్, కేసీ హరిలు సీఎంకు ఘన స్వాగతం పలికారు.

సీఎం పర్యటన వివరాలు: సీఎం ప్రత్యేక విమానంలో ఉదయం 12:33 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. కర్నూలుకు 12:48కి బయలుదేరారు. కర్నూలులో సభ 5:55కు ముగించుకొని ఓర్వకల్లు విమానాశ్రయానికి 6:20కు చేరుకొని గన్నవరానికి 6:35కు బయలు దేరివెళ్లారు. సీఎంకు ఎమ్మెల్యే, ఎంపీ గౌరు చరిత, బైరెడ్డి శబరిలు వీడ్కోలు పలికారు.

సీఎం సభకు తరలివెళ్లిన టీడీపీ నాయకులు :
మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పొదుపు మహిళలు శనివారం కర్నూలులో జరిగిన ప్రజావేదిక సభకు భారీఎత్తున తరలివెళ్లారు. పొదుపులక్ష్మి మండల సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

ఉత్తమ రైతుబజార్‌గా అభివృద్ధి చేస్తాం : సీఎం

కర్నూలు న్యూసిటీ: సి.క్యాంపు రైతుబజార్‌ను ఉత్తమ రైతు బజార్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం సి.క్యాంపు రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు అయ్యమ్మ, వెంకటేష్‌తో మాట్లాడారు. వారి కుటుంబ వివరాలను, యోగక్షేమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించి ముఖ్యమంత్రి ప్రతి రైతు బజార్‌లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. బయోడిజైస్టర్ యంత్రం ద్వారా కూరగాయల వ్యర్థాలను ప్రాసెస్‌చేసే ఎరువుల ఏవిధంగా తయారు చేస్తారని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కలెక్టర్ పి. రంజిత్‌బాషా, రైతు బజార్ సీఈఓ మాధవీలత, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ శ్రీకాంత్, ఏడీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

మిద్దె తోటలతో ఆరోగ్యం పదిలం

కర్నూలు, మే 17 (ఆంధ్రజ్యోతి): మిద్దె తోటలతో ఆరోగ్యం పదిలమని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజావేదిక వద్ద సిటీ ఆఫ్ టెర్రెస్ గార్డెన్ సంస్థ నిర్వాహకురాలు సుధారాణితో చంద్రబాబు మాట్లాడారు. తడి, పొడి చెత్తలతో ఎరువులు తయారు చేసి సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటలు పెంచడం అభినందనీయం అని సీఎం అన్నారు. 30 మందితో చేపట్టిన ఆ ఉద్యమం 70 వేల మందికి చేరడం గొప్పవిషయం అన్నారు. సుధారాణిని నాలెడ్జ్ పార్టనర్‌గా పరిగణిస్తామని వివరించారు. అర్థా గ్లోబల్ సంస్థ కరణ్‌షా, ఐసీఎల్ఈఐ డైరెక్టర్ సౌమ్య చదుర్వేది, గ్రీన్ కో సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వారిని సన్మానించారు. అనంతరం పీ-4 మార్గదర్శులకు కూడా సన్మానించారు. అంతకు ముందు రైతులకు డ్రోన్ పరికరాలను అందజేశారు. పలువురు నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా అర్జీలు స్వీకరించారు.

రైతుబజార్ సిబ్బందికి సీఎం ప్రశంసలు

కర్నూలు అగ్రికల్చర్: రాష్ట్రంలోనే సీ.క్యాంపు రైతుబజార్‌కు గుర్తింపు తెచ్చేలా కృషిచేసిన సిబ్బందిని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతులో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను సిబ్బంది రెండు రోజులుగా తీవ్రంగా శ్రమించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆమేరకు రైతులకు అవసరమైన అన్ని కార్యక్రమాలు, పనులను పూర్తి చేసేందుకు నిమగ్నమయ్యారు. ఎక్కడా కూడా లోటుపాట్లు లేకుంగా సకాలంలో పూర్తి చేయగలిగారు. సీఎం చంద్రబాబు శనివారం మధ్యాహ్నం దాదాపు గంట సేపు సీ.క్యాంపు రైతుబజారులో పర్యటించి రైతుల సమస్యలకు స్థానిక అధికారులు ఏ విధంగా స్పందిస్తున్నారో స్వయంగా అడిగి సంతృప్తి వ్యక్తంచేశారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారిణి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య సిబ్బంది పగలు, రాత్రి అనక శ్రమించారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, రైతుబజార్ల సీఈవో మాధవీలత, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఆదోని రైతుబజార్ ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, అమీన్ అబ్బాస్‌నగర్ ఎస్టేట్ అధికారి జయలక్ష్మి, సిబ్బంది సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేశారు.

ధనలక్ష్మినగర్ వాసులకు నిరాశ

● సీఎంను చూడలేకపోయిన కాలనీవాసులు

కర్నూలు (క్రైం): ధనలక్ష్మినగర్ పార్క్ పైలాన్‌ను ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఆ కాలనీకి వచ్చారు. శనివారం సీఎంను చూసేందుకు ఎంతో ఆశతో ఎదురుచూసిన ధనలక్ష్మినగర్ కాలనీవాసులకు ఎట్టకేలకు నిరాశే ఎదురైంది. ఉదయం నుంచి ముఖ్యమంత్రి వెళ్లేవరకు ఆ పార్కు వద్ద పోలీసులు ప్రవర్తించిన తీరు పలు విమర్శలకు తావిస్తుంది. కాలనీలో ఎవరినీ కూడా ఆ చుట్టు పక్కలకు రానీయలేదు. అంతటితో ఆగకుండా పార్కు సమీపంలో ఉన్న ఇళ్లలో నుంచి ఎవరినీ కూడా బయటకు రానీయకపోవడంతో పాటు కనీసం బాల్కనీల్లో నుంచి కూడా చూడనీయలేదు. అందరూ తలుపులు వేసుకుని, కిటికీలు మూసుకుని ఇంట్లోనే కూర్చొవాలని పోలీసులు ఆదేశించడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



సీఎం సభకు తరలివెళ్తున్న మహిళలు



ఓర్వకల్లులో తరలివెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



రైతు బజారులో ధరల పట్టికను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



పూల రైతుతో మాట్లాడుతున్న చంద్రబాబు



సి.క్యాంపు రైతుబజారులో మూత్రశాలలను పరిశీలిస్తున్న సీఎం



కేరింతలు కొడుతున్న టీడీపీ అభిమానులు



చంద్రబాబు సభకు హాజరైన మహిళలు



ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ నాయకులు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో సీఎం చంద్రబాబు

అడుగడుకో గుంత

- అధ్వానంగా జోహరాపురం-వెంకాయపల్లె రహదారి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రాత్రివేళలో ప్రయాణం మరింత నరకం
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



గుంతల మయంగా జోహరాపురం-వెంకాయపల్లె రహదారి

కర్నూలు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): జోహరాపురం- వెంకాయపల్లె ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రాత్రివేళలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే నరకం చవి చూడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారిని దర్శనార్థం భక్తులు ఈ రహదారిపైనే రాకపోకలు కొనసాగిస్తుంటారు. వాటితో పాటు కర్నూలు నగరంలోని పాతబస్తి, బుధవారపేట, వన్‌టౌన్ ఏరియా ప్రజలతోపాటు, ఇటు జోహరాపురం, రెవెన్యూ కాలనీ, ఇందిరమ్మ కాలనీ వాసులు వెంకాయపల్లె మీదుగా ప్రయా ణిస్తుంటారు. సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు నుంచి ప్రయాణించాలంటే కాస్త దూరమవ్వడమే కాకుండా ట్రాఫిక్ రద్దీ కూడా తీవ్రంగా ఉంటోంది. మార్గమధ్యలో భారీ వాహనాల మధ్య ప్రయాణం కూడా అంతరాయం ఏర్పడుతుందనే ఆలోచనతో కార్లు, స్కూటర్లు, ఆటోలు, ట్రాక్టర్లు యజమాన్యం ఈ మార్గాన్ని ఎంచుకొని తక్కువ సమయంలో త్వరగా గమ్యాన్ని చేరుకుంటారు. అలాంటి పరిస్థితిలో రహదారి కిలో మీటర్ల కొద్ది పాడైపోయింది.

● ప్రతి మంగళ, శుక్రవారల్లో మరింత రద్దీ

వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారికి మొక్కుబడి చెల్లించే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఎండాకాలంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో కర్నూలు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మరోవైపు బీడీకార్మికుల కోసం నిర్మించిన ఇందిరమ్మ కాలనీలో దాదాపు వెయ్యి కుటుంబాలు జీవనం చేస్తున్నారు. వీరంత ప్రతిరోజు పనుల నిమిత్తం ఆ రహదారి మీదుగానే కర్నూలుకు వెళ్తుంటారు. సాయంత్రం పనులు ముగించుకుని స్వగ్రామాలకు రాత్రి పూట ఆటోలు, స్కూటర్లు ద్వారా ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. రహదారిపై ఎక్కడ చూసిన గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు అదుపుతప్పి కిందపడి కొంతమంది ప్రాణాలు కోల్పోయారని, మరికొంతమంది క్షతగాత్రులుగా మిగిలిన సంఘటనలు ఉన్నాయని ఇందిరమ్మకాలనీ, వెంకాయపల్లె గ్రామస్థులు చెబుతున్నారు. ఈ రహదారి గుంతలు పడి ఏళ్లు కావస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. కనీసం గుంతలకు అతుకులు(పాచ్) వర్కులు కూడా చేపట్టడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తట్ట మట్టి కూడా వేయలేదని స్థానికులు చెబుతున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం హయాలోనైన ఆర్‌అండ్‌బీ అధికారులు స్పం దించి జోహరాపురం-వెంకాయపల్లె రహదారి పునఃనిర్మాణం చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి



ప్రతి రోజు ఇందిరమ్మ కాలనీ నుంచి కర్నూలుకు పనులకు వెళ్తుంటాం. రాత్రి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో రోడ్డుపై గుంతల కనిపించక బైక్‌పై నుంచి కింద పడి గాయాలయ్యాయి. నాలాంటి వారు చాలా మంది ఉన్నారు.

\- దేవన్న, ఇందిరమ్మ కాలనీ వాసి

గుంతలు పూడ్చాలి



గుంతలు పూడ్చిస్తే చాలు. కొంతకాలం రోడ్డు పని చేస్తోంది. ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఈ రోడ్డును ప్రజాప్రతినిధులు, అధికారులు గానీ ఎవరూ పట్టించుకోవడంలేదు.

\- కుమార్, ఇందిరమ్మ కాలనీ వాసి

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

ఉపాధి సిబ్బందికి వేతనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హాలహర్వి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బందికి మూడు నెలల జీతాలు మంజూరయ్యాయి. ఈ నెల 13న ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు సిబ్బంది ఖాతాల్లోకి మూడు నెలల వేతనాలు జమ చేశారు. ఒకేసారి వేతనాలు రావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో కూలీలకు సైతం వేతనాలు జమ అవుతాయని ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు.

బీపీని అదుపులో ఉంచుకోండి



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మద్దికెర, మే 17 (ఆంధ్రజ్యోతి): రక్తపోటు బాధితులు బీపీని అదుపులో ఉంచుకోవాలని, అనవసరంగా ఆలోచించవద్దని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా సూచించారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ వైద్యశాలలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు రక్తపోటు పై అవగాహన కల్పించారు. సాధారణ బీపీ 80/120లోపు ఉండాలని, వారానికోసారైనా బీపీ చెక్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు.

కుక్కలకు శస్త్రచికిత్సలు ప్రారంభం

ఆదోని టౌన్, మే17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు శస్త్ర చికిత్సతోపాటు వ్యాక్సినేషన్ చేసే కేంద్రాన్ని కమిషనర్ కృష్ణ కౌన్సిలర్ సురేష్ శనివారం ప్రారంభిం చారు. పంప్ హౌస్‌కు సమీపంలోని మున్సిపల్ సెంటర్‌లో ఏర్పాటు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, పట్టణంలో కుక్కల బెడద అధికమైన కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు శస్త్ర చికిత్సల్చు చేయనున్నా మని, పట్టణంలోని 1,410 కుక్కలకు శస్త్ర చికిత్స చేసిన అనంతరం వాటిని తిరిగి నివాస ప్రాంతాలలోనే వదిలేస్తామన్నారు. ఇప్పటికే శస్త్ర చికిత్స చేసి ఉంటే వదిలేస్తామన్నారు. కుక్కకాటుతో ప్రజలు రోగాల బారిన పడకుండా వ్యాక్సిన్ వేస్తామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ డా అనుపమ, హెల్త్ ఆఫీసర్ డా సందీప్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సురేష్

రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ఆదోని అగ్రికల్చర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆదోని ఉప విద్యాశాఖ అధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలు ఇప్పటికే పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయన్నారు. ఆదోని డివిజన్‌లో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మునిసిపల్ ఉన్నత పాఠశాల, నెహ్రూ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య, భాష్యం పాఠశాలల్లో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 4,400 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'తో ధైర్యం

● ఆలూరులో తిరంగా ర్యాలీ



ఆలూరులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆలూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశ ప్రజల్లో ధైర్యం వచ్చిందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆలూరులో కూటమి నాయకులు, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వీరభద్రగౌడ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను హతమార్చడంలో భారత సైన్యం విజయం సాధించడంపై జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. బీజేపీ ఇన్‌చార్జి వెంకటరాముడు, జనసేన నాయకుడు రంజిత్, డీసీ అధ్యక్షుడు కిష్టప్ప, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామ్‌నాథ్‌యాదవ్, టీడీపీ నాయకుడు గిరిమల్లేష్‌గౌడ్, కన్వీనర్లు అశోక్, పరమరెడ్డి, బాబు, రఘుప్రసాద్‌రెడ్డి, నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, ముద్దురంగ, దేవేంద్రయాదవ్, సతీష్, గుండన్న పాల్గొన్నారు.

21న డీఈవో కార్యాలయం ముట్టడి

ఆదోని అగ్రికల్చర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈనెల 21న డీఈవో కార్యాలయ ముట్టడికి తరలి రావాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి బి.గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చల పేరుతో సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

సైనికులకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్ చౌదరి

ఆదోని, మే17 (ఆంధ్రజ్యోతి): దేశ సైనికులకు అండగా నిలుద్దామని టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. శనివారం టీడీపీ యువ నాయకుడు మారుతి నాయుడు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం చేయనున్న తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ మైదానం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందని, శ్రీనివాస్ భవన్, ఏరియా హాస్పిటల్ మీదుగా భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ చౌదరి, జనసేన పట్టణ అధ్యక్షుడు రేణు వర్మ, వైసీపీ తరఫున మునిసిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఫయాజ్, బీజేపీ నాయకులు నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

నాడు వెలవెల — నేడు కళకళ



నాడు వెలవెల

పత్తికొండ, మే17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చరిత్రాత్మకమైన మీటింగ్ కట్టకు పూర్వ వైభవం వచ్చింది. స్థానిక తేరు బజార్‌లో బ్రిటీష్ హయాంలో నిర్మించిన మీటింగ్‌కట్టకు ప్రత్యేకస్థానం ఉంది. ఈ వేదిక నుంచి స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, కళాకారులు మాట్లాడారు. అయితే ఇది శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సొంత నిధులతో బాగుచేయించారు. ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన మీటింగ్ కట్టను ప్రారంభించనున్నారు. పట్టణ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



నేడు కళకళ

ఓ వైపు స్వచ్ఛాంధ్ర, మరోవైపు మురుగు

● పరిసరాల పరిశుభ్రతపై మద్దికెరలో అధికారుల ర్యాలీ, ఎం.అగ్రహారంలో రోడ్డుపై డ్రైనేజీ



మద్దికెరలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మద్దికెర, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, సర్పంచ్ బండారు సుహాసిని సూచించారు. శనివారం ఎస్సీ కాలనీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులకు అందించాలన్నారు. వీఆర్వో రంగస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు పారా రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.



ఎం.అగ్రహారంలో రోడ్డుపై మురుగు

ఎం.అగ్రహారంలో రోడ్డుపైనే మురుగు

మద్దికెర మండలం ఎం.అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీలో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. మురుగు ఇలా రోజుల తరబడి నిల్వ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ వైపు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు పారిశుధ్య పనులు చేయించడం మరిచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దంచికొట్టిన వాన

● పెరవలి గ్రామంలో మునిగిన పొలాలు, కూలిన విద్యుత్ స్తంభాలు



పెరవలి-బసినేపల్లి మధ్య నీట మునిగిన పొలాలు



పెరవలిలో పొంగిపొర్లుతున్న గోధుమ చెరువు

మద్దికెర, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు 5 సెం.మీ.పైగా వర్షం కురవడంతో గోధుమ చెరువు పొంగి పొర్లింది. ఉరుములు, మెరుపులతో గాలి వాన కురవడంతో విద్యుత్ స్తంభాలు కూలి, సరఫరాకు అంతరాయం కలిగింది. చెరువు పొంగిపొర్లడంతో పక్కనే ఉన్న రోడ్డుపై నీరు ప్రవహించిది. కొందరు రైతులు పొగాకును ఆరబెట్టారు. అయితే భారీ వర్షం ప్రభావంతో అది దెబ్బతింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది స్తంభాలను సరిచేసి, ఉదయం 11 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యలు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న బొజ్జమ్మ, వైకుంఠం జ్యోతి

ఆలూరు/దేవనకొండ, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు శనివారం వచ్చిన సీఎం చంద్రబాబుకు సమస్యలను వివరిం చినట్లు టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. వేదవతి, నగరడోణ, హంద్రీనీవా పనులు పూర్తి చేసి సాగు, తాగునీరు అందిచాలన్నారు. గ్రామాల రోడ్లను బాగు చేయాలని కోరారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆదోనిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ఆదోని టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీని కమిషనర్ కృష్ణ ప్రారంభించారు. పారిశుధ్య నిర్వ హణ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలులను అధిగమించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ డా అనుపమ, డీఈ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్, సిబ్బంది

నేడు తిరంగా ర్యాలీ

పత్తికొండ, మే17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో దేశ విజయాన్ని హర్షిస్తూ పత్తికొండ పట్టణంలో నేడు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు సురేష్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే శ్యాంబాబు నాయకత్వంలో సాయంత్రం 4 గంటలకు అంబేడ్కర్ సర్కిల్ నుంచి తేరుబజార్ మీటింగ్ కట్ట వరకు ర్యాలీ ఉంటుందని, బిజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో పాటు, ప్రజలు పాల్గొని అమరవీరులకు నివాళి అర్పించాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి

క్రిష్ణగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని క్రిష్ణగిరి సర్పంచ్ పెనికలపాటి వరలక్ష్మి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణాపురం దామోదర్ నాయుడు కోరారు. శనివారం క్రిష్ణగిరిలో పారిశ్యుధ్య పనులు నిర్వహించారు. ఈవో ఆర్డీ లచ్చప్ప, చక్రపాణి పాల్గొన్నారు.

లోపాలను సరిచేస్తాం

హాలహర్వి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలం లోని నిట్రవట్టి గ్రామంలో రీ సర్వే లోపాలను సరిచేస్తామని తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి, ఫిర్యాదులు తీసుకుంటామన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు.

చెత్తను సంపదగా మారుద్దాం

● ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



చెత్త సేకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): చెత్తను సంపదగా మార్చి, గ్రామ పంచాయితీకి ఆదాయాన్ని సమకూరు ద్దామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రజలకు సూచించారు. శనివారం పత్తికొండ కోయ నగర్‌లో స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివస్‌లో సర్పంచ్ కొమ్ము దీపికతో కలిసి పాల్గొన్నారు. చెత్తసే కరణ వాహనం వెంట నడుస్తూ తడి, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల్లో చెత్తను వేస్తే, రోగాలను కొనితెచ్చుకుని అనారోగ్యాల పాలవుతారన్నారు. చెత్తను ఇంటివద్దకు వచ్చే పంచాయతీ బండిలో వేయాలన్నారు. స్వచ్ఛ పత్తికొండను సాధించు కోవాలంటే ప్రజల్లో మార్పు వస్తేనే సాధ్యమన్నారు. ఈవో నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తాలేని వెలుగుసిబ్బంది

ప్రభుత్వం ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంటుంది. పొదుపు మహిళలను అనుసంధానం చేసి మహిళలకు కల్పించాల్సిన వెలుగు ఏపీఎం, సిబ్బంది కనిపించలేదు.

రంగమ్మ కుంటను ఆధునికీకరిస్తాం

మద్దికెర, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులోని రంగమ్మ కుంటను వాటర్‌షెడ్ నిధులతో ఆధునికీకరిస్తామని జిల్లా వాటర్ షెడ్ పీవో వలి, జేఈ అయూబ్ అన్నారు. శనివారం రంగమ్మ కుంటను పరిశీలించారు. ఈ కుంటలో నీరు పుష్కలంగా ఉందని, ఎస్సీ కాలనీ, పొలాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. రహదారి అన్యాక్రాంతమైందని, కొలతలు వేసి రహదారి నిర్మిస్తామన్నారు. సమీపంలోని హిందూ శ్మశాన వాటిక లోని ముళ్ల కంపను తొలగిస్తామన్నారు. నిధులు మంజూరుచేయాలని సర్పంచ్ బండారు సుహాసిని కోరారు. సలహాదారుడు బండారు ఆంజనేయులు, సభ్యులు కవిరెడ్డి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కవిరెడ్డి రామాంజులు, షేక్షావలి, రామాంజులు ఉన్నారు.

సంస్కృతితో ముడిపడ్డ దేశ రక్షణ



మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

ఆలూరు, మే 17(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ సంస్కృతితో ముడిపడి ఉందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. శనివారం అరికెర గ్రామంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా మాట్లాడుతూ పురాణాలు ధర్మానికి ఎంత ప్రాధాన్యమిచ్చాయో దేశభక్తి, దేశ రక్షణకు కూడా ఇచ్చాయని అన్నారు. అనంతరం ఈఆర్‌కేవీ ప్రసాద్‌రావు ధార్మిక ఉపన్యాసాలు, భజన భక్తులను అలరించాయి. నాగరాజాచార్యులు, వేద పండితులు అచ్యుత్, గోపాలచార్యులు, శేషయ్యాచార్యులు, రంగయ్యాచార్యులు, గ్రామపెద్దలు భీమేష్‌రెడ్డి, మల్లికార్జున, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారి కుచ్చుటోపీ?

● సుమారు రూ.20 కోట్లు మోసం చేసినట్లు ప్రచారం
● లబోదిబోమంటున్న బాధితులు

ఆదోని , మే 17 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారి అధిక వడ్డీ ఆశ చూపి 30 మంది నుంచి సుమారు రూ.20 కోట్లతో ఉడాయించినట్లు ఆదోని పట్టణంలో జోరుగా ప్రచారం సాగుతోంది. బాధితులంతా స్నేహితులు, బంధువులే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని ఓ బాధితుడి తెలిపిన వివరాలివీ.. ఆదోని పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆదోని పట్టణం నడిబొడ్డున పేరుగల హార్డ్ వేర్, టైల్స్ వ్యాపారం చేస్తు వాళ్ల తాత పేరును ఉపయోగించుకుని బంధువులు, స్నేహితుల నుంచి డబ్బులు వసూలు చేసుకొని ఉడాయించినట్లు తెలుస్తోంది.

కొందరు మొదట రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీకి ఇవ్వగా.. ప్రతి నెలా ఇచ్చిన మొత్తానికి వడ్డీ సక్రమంగా ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆ యువకుడిని నమ్మి ఒకరికి తెలియకుండా ఒకరు రూ.5లక్షలు నుంచి రూ. 10లక్షల వరకు అప్పులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని రోజులు నుంచి ఆ యువకుడు కనిపించకపోవడంతో విషయం బయటపడింది. ఆ యువకుడు ఇతర దేశాలకు వెళ్లి జల్సాలకు, బెట్టింగులకు పాల్పడి పూర్తిగా నష్టపోయినట్లు సమాచారం. దీంతో ఆ యువకుడు టైల్స్ షాపును క్లోజ్ చేయడంతో బాధితులు ఆ యువకుడి తండ్రి, వారి తాత దగ్గరకు వెళ్లి తాము అప్పు ఇచ్చి మోసపోయినట్లు వారికి వివరించినట్లు సమాచారం. అయితే వారి కుటుంబ సభ్యులు మాత్రం అప్పులు ఇచ్చేటప్పుడు ఒక్కమాటైనా అడిగారా అంటూ అప్పులు ఇచ్చిన ఆసాములను నిలదీయడంతో దిక్కుతోచక అప్పులు ఇచ్చినవారు మిన్నకుండిపోయారు. ఒకవైపు పోలీసులకు పిర్యాదు చేస్తే తమకు ఏ ఇబ్బంది వస్తుందోనన్న భయంతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనట్లు సమాచారం. విషయంపై వన్ టౌన్ సీఐ శ్రీరామ్‌ను వివరణ కోరగా ఆదోని పట్టణానికి చెందిన హార్డ్‌వేర్ వ్యాపారి అప్పులు ఇచ్చిన వారికి సకాలంలో ఇవ్వకుండా కనిపించక పోవడం వాస్తవమేనని చెప్పారు.

వన్ టౌన్, టూ టౌన్ పరిధిలో ఆ యువకుడి బాధితులు ఉన్నారన్నారు. ఓ వివాహిత మాత్రం ఆ యువకుడు రూ.5 లక్షలు వడ్డీకి తీసుకున్నట్లు చెప్పారని, అయితే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. అయినప్పటికీ ఆ యువకుడి కోసం ప్రత్యేకంగా నిఘా ఉంచామని చెప్పారు. బాధితులు ఎవరైనా ఇచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

● న్యాయధికారి టి.జోత్స్నదేవి



మాట్లాడుతున్న న్యాయధికారి జోత్స్నదేవి


పత్తికొండ/టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జులై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదంచేయాలని న్యాయధికారి టి.జోత్స్నదేవి సూచించారు. పత్తికొండ సివిల్ జడ్జి కోర్టులో శనివారం ఆమె న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయవాదులు తమ పరిధిలో రాజీ అయ్యేందుకు వీలున్న కేసులను గుర్తించి కక్షిదారులతో మాట్లాడి వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

రైతుల ఎదురుచూపులు

● అన్నదాతలకు అందని వడ్డీ రాయితీ
● ప్రభుత్వం నిధులు ఇచ్చినా జమచేయని అధికారులు



ఆలూరు విశాల సహకార పరపతి సంఘం



ఆలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): సొసైటీల నుంచి రుణాలు తీసుకుని వాటిని సకాలంలో చెల్లించే రైతుల కోసం ప్రభుత్వం వడ్డీ రాయితీని అమలు చేస్తోంది. ఆలూరు పరిధిలో 5 సొసైటీలు ఉండగా, రైతులకు ఇచ్చేందుకు రూ.53.85 లక్షలు మంజూరు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా రాయితీ రైతులకు చేరడం లేదు. ఆలూరు, బెల్దోణ, హొళగుంద, చింతకుంట, ఆస్పరి సొసైటీల పరిధిలో మొత్తం 10 వేలకు పైగా రైతులు ఉన్నారు. వీరికి ఏటా రైతులు తీసుకున్న పావలా వడ్డీ రుణాలకు సంబంధించి మార్చి 31 నాటికి సక్రమంగా వడ్డీ చెల్లించిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4 శాతం వడ్డీ రాయితీని తిరిగి చెల్లిస్తుంది.

ఈ లెక్కన 5 సొసైటీలకు మొత్తం రూ.53.85 లక్షలు కేంద్ర సహకార బ్యాంకుకు జమ అయ్యాయి. అయితే ఆ డబ్బును సొసైటీల వారీగా ఏ రైతుకు ఎంత వడ్డీ రాయితీ వస్తుందో లెక్క గట్టి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో అమలు కావడం లేదు. అధికారులు ఇంకా లెక్కలు వేసే పనిలోనే ఉన్నారు. ఇప్పటికైనా వడ్డీ రాయితీ తమకు అందించాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే సొసైటీలకు జమచేస్తాం



ఆలూరు పరిధిలోని 5 సొసైటీలకు వడ్డీ రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.5.85లక్షలు జమ చేసింది. వీటిని సంబంధిత సొసైటీల ఖాతాల్లోకి జమ చేస్తాం. సొసైటీ సీఈవోలు లెక్కలు కట్టి రైతుల ఖాతాల్లోకి జమచేసే విధంగా చూస్తాం.

\- రవిప్రకాష్, మేనేజర్, కేంద్ర సహకార బ్యాంకు

ఉల్లిపై రైతన్న ఆశలు

● ఖరీఫ్ ప్రారంభంలోనే సాగు
● బావులు, బోర్లకింద దాదాపు వెయ్యి ఎకరాల్లో
● పంట సాగుచేతికందే సమయానికి ధర

గోనెగండ్ల, మే 17(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట పై రైతన్నకు చాలా ఆశ.. ఒకసారి ధర లేక పోయిన మరోసారైనా ధర వస్తుందనే ఆశ .. ధర పలికిందంటే నష్టమంతా ఒక్క సారి పూడ్చుకుంటామనే నమ్మకం. మరోసారి ఉల్లి పంటను సాగు చేసుకునేలా చేస్తుంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఉల్లి పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయారు. క్వింటాం ధర రూ. 800 నుంచి రూ. 500 పలకడంతో రైతన్న అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్ లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో చాల మంది రైతులు బావులు, బోర్ల కింద ఉల్లి పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తారు వ ర్షం రెండు సార్లు కురవడంతో భూమి చల్లబడిందని రైతులు ఉల్లి పంటను సాగు చేస్తున్నారు. అయితే ఉల్లి పంట చేతికి అందే సమయానికి


గోనెగండ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లి నారు


బోర్ల కింద సాగు చేసిన ఉల్లి

పండిన ఉల్లి పంటకు గిట్టు బాటు ధర లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మండలాల పరిధిలో ఇప్పటికే బావులు, బోర్ల కింద దాదాపు వెయ్యి ఎకరాల్లో ఉల్లి పంట ను సాగు చేశారు. కొంద మంది రైతులు ఉల్లినారును సైతం అమ్మకానికి సిద్దంగా ఉంచారు.

గడచిన ఏడాది నష్టాలు..

గత రబీ సీజన్‌లో ఉల్లి పంట సాగుచేసిన రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడులు రాక చివరికి రవాణా ఖర్చులు కూడా అందక అప్పులపాలైన పరిస్థితి. క్వింటం రూ 800 నుంచి రూ. 500 పలికింది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాప. ఐదు కోట్ల రూపాయల పంట నష్టం జరిగిందని సమాచారం గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మండలాల్లో చాల మంది రైతులు పండించిన ఉల్లి పంటను పొలాల్లోనేమూగజీవాలకు వదిలి వేయడం, ట్రాక్టర్‌తో దున్నివేయడం జరిగిన సంఘటనలు కోకొల్లలు.

గిట్టుబాటు లభిస్తుందన్న ధీమా

జిల్లాలో ఎమ్మిగనూరు. మంత్రాలయం, ఆదోని ప్రాంతాలలో ఉల్లి పంట అధికంగా సాగు చేస్తారు. ఇప్పుడు ఉల్లి పంట సాగుచేసినా పంట చేతికి అందే సమయానికి ఉల్లి నిల్వలు చెప్పుకోదగ్గ స్థాయిలో లేకపోతాయని, కావున ముందుగా పండిన ఉల్లి పంట అమ్మకానికి రావడంతో మంచి డిమాండ్ పలుకుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఒక ఎకరంలో ఉల్లి సాగు చేశా



పోయిన ఏడాది 2 ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేసి దాదాపు రూ. 80వేలు నష్టపోయాను, కనీసం పెట్టుబడులు కూడా అందలేదు. ఈ సారైనా గిట్టుబాలు ధర లభిస్తుందని నమ్మకంతో ఒక ఎకరంలో ఉల్లి పంటను సాగుచేశాను. పెట్టుబడుకూడా పెరుగుతున్నాయి.

● కబుల్, రైతు, గోనెగండ్ల

జనసేన బలోపేతానికి కృషి


సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న

మంత్రాలయం, మే 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న తెలిపారు. శనివారం మంగళగిరి పార్టీ అధికార ప్రతినిధి సాయి ఆధ్వర్యంలో క్రియాశీలక మెంబర్లకు ఐడీ కార్డులు, కిట్లు పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యకర్తలకు మేలు చేసే విధంగా బీమా పథకాన్ని చేపట్టారని తెలిపారు. ప్రమాదం జరిగితే మెడికల్ ఖర్చుల కింద రూ.50వేలు, మృతి చెందితే రూ.5 లక్షలు కుటుంబ సభ్యులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో వీరారెడ్డి, బజారి, చిన్న, సుమిత్ర, అలీబాషా, బీవీ రవిచంద్ర, యేసన్న, ప్రభుదాసు, నరసింహులు, చెన్నారెడ్డి, అబ్దుల్, రాంప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి తగ్గేవరకు చలివేంద్రాలు కొనసాగాలి

మంత్రాలయం, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామస్థులు, భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగించాలని ఎంపీడీవో నూర్జహాన్ అన్నారు. శనివారం మంత్రాలయం పాత రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రంలో తాగునీటిని ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుంచి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిని భక్తులు, గ్రామస్థులు, గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చలివేంద్రాల వల్ల ఎంతో మందికి దాహార్తి తీరుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకట్రాముడు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, సెక్రటరీ ఇబ్రత్ బాషా, వీఆర్వో భీముడు, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, అశోకవర్మ, బాల వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో చోరీ

నందవరం, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం వీరభద్రస్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం సమయంలో వెండి కిరీటాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌గౌడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంగలించబడిన కిరీటం 70 తులాలు ఉందన్నారు. స్వామి వారిపై ఉన్న అభరణాలు కూడా దొంగలించేందుకు ప్రయత్నించగా అవి రాక పోవడంతో వదిలేసి వెళ్లినట్లు తెలుస్తుందన్నారు. తెలిసిన వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరమణయ్య

పెద్దకడుబూరు , మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను కూలీలు వినియోగించుకోవాలని ఏపీడీ వెంకటరమణయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని పెద్దకడుబూరు పరిసరాల్లో కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి, ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల వివరాలను, పనులకు సంబంధించిన బిల్లుల వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

కళాశాల భూములను పరిరక్షించాలి


మాట్లాడుతున్న మహేంద్రబాబు

ఎమ్మిగనూరు రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెటర్నరీ కళాశాల భూములను పరిరక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. కళాశాలకు 276 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయిస్తే. కొంతమంది అక్రమంగా స్వాధీనంలోకి తీసుకున్నారు. ఇంత జరుగుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈసమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రమోద్, తన్వీర్, సూర్య, వీర పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : కార్మిక రైతు చట్టాల అమలుకై మే20న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఐఎఫ్‌టియూ పాలక నాయకులు రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు గోవిందు, రాముడు, బాలరాజు, ఏఐకెఎంఎస్ అనీఫ్, సత్యన్న తిమ్మగురుడు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మికుల రైతు వ్యతిరేకత నాలుగు లేబర్ చట్టాలను, మూడు వ్యవసాయ చట్టాలను రద్దుచేయాలని మే20న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటీయూసీ, ఎకెఎమ్ఎస్, ఐఎఫ్‌టియూ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, మే17(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుడికల్లు గ్రామంలో వాగ్వాదం చోటు చేసుకొని ఓ మహిళకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గిడ్డమ్మ, దావీదుల కుమార్తెను అదే గ్రామానికి చెందిన నల్లన్న వివాహం చేసుకుంటానని అడుగగా అమ్మాయి కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఆగ్రహానికి గురైన నల్లన్న, గిడ్డమ్మ, దావీదుల ఇంటికి వెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో గిడ్డమ్మ, దావీదుల బంధువు అయిన శాంతి అనే మహిళకు రాయి తగిలి గాయమైంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మిగనూరులో తిరంగా ర్యాలీ


తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, మే17(ఆంధ్రజ్యోతి): మనదేశం వైపు పాకిస్తాన్ చూస్తే తగిన గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి దాయాది దేశాన్ని హెచ్చరించారు. శనివారం దేశసైనికులకు సంఘీభావంగా పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీనివాస సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు కూటమి పార్టీల నాయకులు 300అడుగుల జాతీయ జెండాను చేతపట్టుకొని రాలీ చేశారు. ర్యాలీలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ మన దేశప్రతిష్టతను, సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిందన్నారుమన దేశభద్రతను కాపాడుతున్న త్రివిదధళాల సేవలు ఏనలేనివన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్ అమర రహే అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, మిఠాయి నరసింహులు, రామదాసు గౌడ్, శాబీర్, తురేగల్ నరసింహులు, కొండన్న గౌడ్, రామకృష్ణ నాయుడు, బుగిడే నాగరాజు, భార్గవ్, మహేష్, రామకృష్ణారెడ్డి, ధర్మాపురం గోపాల్, కురువ మల్లయ్య, మద్దిలేటి, బీజేపీ నరసింహులు, శివ, గుడికల్ దేవదాస్, బచ్చాల రంగన్న,నరసింహులు, జనసేననాయకులు పాల్గొన్నారు.

హెచ్. మురవణిలో తిరంగా జెండా ర్యాలీ


తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెద్దకడుబూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్. మురవణి గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రారెడ్డి ఆదేశాల మేరకు తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో రాత్రి 7గంటల వరకు జాతీయ జెండాను చేతపట్టుకొని కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మురళి, సత్యన్నగౌడ్, శివ, రామలింగలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మూడరోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

ఎన్టీఆర్ జలసిరి పథకం రైతులకు వరం

ఎమ్మిగనూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జలసిరి పథకం రైతులకు ఓ వరం లాంటిదని కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక సమితి సభ్యులు కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ జలసిరి పథకం నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని తీసుకురావడంతో జిల్లాలోని రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధితులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎల్లమ్మ బీడు దగ్గర మూడు అంతస్తుల భవనం నిర్మాణ దశలో కాంట్రాక్టర్, ప్రైవేట్ ఇంజనీరు నిర్మాణ రాహిత్య లోపాల వల్ల గాయాలు పాలైన క్షతగాత్రులకు ఆర్థిక సహాయం అందించాలని సిపీఐ(ఎంఎల్) న్యూడె మోక్రసీ జిల్లా నాయకులు ఎం సత్యన్న డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి కురిసిన గాలి వానకు నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనంలోని గోడ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడడం వల్ల అందులో ఉన్న 12 మంది గాయపడ్డారన్నారు. బాధితులు శ్రీరాములు, లిఖిత, రుచితలకు తీవ్రమైన గాయాలయ్యాయని వారు కొలుకునే వరకు చికిత్సకు ఖర్చులు భరించాలని, అలాగే ఇంజనీరు లైసెన్స్‌ను రద్దు చేయాలని. డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, చిన్నిప్రసాద్, పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాలి

ఎమ్మిగనూరు రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో తాగునీటి కష్టాలను తీర్చాలని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు కోరారు. శనివారం ఎమ్మిగనూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వీరేష్, సుంకన్న, నరసింహులు, నాగరాజు, రవి లు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం వైశాఖ పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి అర్చకుల మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

మంత్రాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. శనివారం వైశాఖ పంచమి దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహాలంగా మారింది. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటల్‌లు, పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది.

సాగునీటి ప్రాజెక్టులను పునరుద్ధరించండి


సమస్యలు వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, మే 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వెనకబడిన పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలో నిలిచిపోయిన, జరగబోయే అభివృద్ధి, తాగు, సాగు నీటి పనులకు నిధులు మంజూరు చేసి నీటి ప్రాజెక్టులను పునరుద్ధరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి కోరారు. కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని కలసి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు లేక పోవడం వల్ల వ్యవసాయం భారమై రైతు కుటుంబాలు వలసలు వెళ్తున్నాయని తెలిపారు. ఆర్‌డీఎస్ కుడి కాలువ, గురురాఘవేంద్ర పంపుహౌసులు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వలసలు నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మంత్రాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సాగు, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఆర్ అండ్‌బీ రోడ్లు, అన్నక్యాంటీన్, షాదీ ఖానాలు ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. ఇందుకు సీఎం సానకూలంగా స్పందించినట్లు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. అదేవిధంగా మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను కలసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రైతుఅధికార ప్రతినిధి, దూదేకుల రాష్ట్ర గౌరవ సలహాదారుడు సాయిబాబ, టీడీపీ నియోజకవర్గ ఉలిగయ్య పాల్గొన్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'


ఎమ్మిగనూరులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో అధికారులు, నాయకులు


మంత్రాలయంలో..


కౌతాళంలో..

ఎమ్మిగనూరు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, నాయకులు అన్నారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో కార్యక్రమంలో భాగంగా హీట్ ద బీట్ అను నినాదాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, పొదుపు సభ్యులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా శనివారం గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల మూడవ వారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా రాష్ట్రాన్ని మరియు మన పరిసరాలను పరిశుభ్రత గురించి అవగాహన పెంచడం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. కార్యక్రమంలో ఏఈ శరత్, పబ్లిక్‌హెల్త్ డీఈ రాజునాయక్, మేనేజర్ వరప్రసాద్, డీఈఈ నీరజ, రాజునాయక్, సత్యన్నా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రాలయం: ఇంటి పరిసరాలతో పాటు కాలనీలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ ఎస్.రవి, ఎంపీడీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వెంకట్రాముడు, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. శనివారం మంత్రాలయంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించి రాఘవేంద్ర సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో-ఏవో రాధ, కీర్తి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివకృష్ణ, డిజిటల్ అసిస్టెంట్లు చంద్ర, వీఆర్వో భీముడు, వీరేష్, దానియేల్ గ్రామ కార్యదర్శులు ఇబ్రత్ బాషా, అశోక్‌వర్మ పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ పిలుపుతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎరిగేరి గ్రామంతో పాటు కౌతాళంలో ఎంపీడీవో విజయశేఖర రావు, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆశావర్కర్లతో కలిసి ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం చేపట్టి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, ఈఓపీఆర్డీ ప్రకాశం, సచివాలయ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ అంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా బుడుములదొడ్డి, ఎరిగేరి పులిగట్టు, అగసలదిన్నె దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌కు శుద్ధజలాలచే అభిషేకం నిర్వహించి ఫలపుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. బుడుములదొడ్డి అంజనేయస్వామికి పలికే దేవుడిగా పేరు ఉండటంతో ఈ దేవాలయంలో ఆకు పూజకు ప్రత్యేకత ఉంది. తర్వాత దేవాలయంలో సీతారాముల వారిని ప్రత్యేక రథంలో దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

20న ఎమ్మిగనూరులో మినీ మహానాడు

ఎమ్మిగనూరు, మే17(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న ఎమ్మిగనూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ మిని మహానాడును నిర్వహించనుంది. స్థానిక కుర్ణి కమ్యునిటీ హాల్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మినీమహానాడును నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిని మహానాడుకు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలం, గోనేగండ్ల, నందవరం మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, ఇంచార్జీలు, మాజీ కమిటి సభ్యులు, మహిళా విభాగం సభ్యులు హాజరు కానున్నారు.

గోనెగండ్లలో వాన బీభత్సం


నెరుడుప్పల పంట పొలాల్లో కింద పడ్డ ట్రాన్స్‌ఫార్మర్

గోనెగండ్ల, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు నెరుడుప్పల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామాలలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాత్రి తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలుల కారణంగా ఈ గ్రామాల్లో 10 నుంచి 20 విద్యుత్ స్థంభాలు నెలకొరిగినట్లు తెలుస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాలు రెండు రోజులుగా అంధకారంలో మగ్గుతున్నాయి. విషయం తెలుసుకున్న మండల విద్యుత్ అధికారులు స్థంబాలు ఎన్ని కింద పడిపోయాయో తెలుసుకొని వాటి స్థానంలో కొత్త స్థంబాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.